# జనగామకు కేసీఆర్ జలాభిషేకం

- కల్పతరువుగా మారిన కరువు జిల్లా
- దేవాదులతో 'జల'గామగా మార్పు
- ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకుతున్న చెరువులు, కుంటలు
- వందల కోట్ల నిధుల కేటాయింపుతో కొత్త పుంతలు తొక్కుతున్న జిల్లా
- తొమ్మిదిన్నరేండ్లలో పెను మార్పులు

*దక్కన్ పీఠభూమిలోనే అత్యంత ఎత్తయిన ప్రాంతం.. సముద్రమట్టానికి ఏకంగా 550 మీటర్ల ఎత్తు. బోర్లు వేయడం, ఇసుక తీయడంపై నిషేధం. తాగుదామంటే గుక్కెడు నీటికి తండ్లాడిన జనం. బతుకే అగమ్యగోచరం. ఇదీ జనగామ ప్రాంత దుస్థితి. కానీ, తెలంగాణ ప్రభుత్వం రావడంతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. తొమ్మిదేండ్లలో జనగామ జిల్లాకు జలకళ వచ్చింది. దేవాదుల రూపంలో గోదారమ్మ గలగలా పారింది. ఎండాకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. నాటి అతి దుర్భిక్ష ప్రాంతం.. నేడు బంగారు పంటల కేంద్రంగా మారింది.*



మత్తడి దుంకుతున్న నవాబ్‌పేట రిజర్వాయర్

జనగామ, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు కరువుకు కేరాఫ్‌గా ఉన్న జనగామ ప్రాంతం.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త రూపు సంతరించుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం గడిచిన తొమ్మిదేండ్లలో చేపట్టిన కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా ప్రతీ పల్లె పచ్చని మాగాణంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల జీవన విధానం పూర్తిగా కొత్త పుంతలు తొక్కింది. తెలంగాణ రాక ముందు ఈ ప్రాంత వరప్రదాయినీ దేవాదుల రిజర్వాయర్ పనులు పూర్తికాలేవు. కన్నెబోయిన గూడెం, మద్దూరు మండలం లద్నూరు దేవాదుల రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా మిగిలాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆ పనులు పూర్తిచేసి నీళ్లు విడుదల చేశారు. చేర్యాల మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, బచ్చన్నపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలు విడుదల చేశారు. చేర్యాల నగర పంచాయతీని మున్సిపాలిటీగా మార్చారు. రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.11 కోట్లతో ప్రభుత్వ దవాఖాన నిర్మించారు. పట్టణంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, రూ.కోటితో అంబేద్కర్‌హాల్ నిర్మించారు. మున్సిఫ్ కోర్టును ఏర్పాటు చేశారు. కొమురవెల్లిలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు, చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల్లో రూ.10 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించారు.

**325 కోట్లతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు కాలువ**

చేర్యాల మండలాన్ని విభజించి కొమురవెల్లి మండలంగా, మద్దూరు మండలాన్ని విభజించి ధూళిమిట్ట మండలంగా, నర్మెట మండలాన్ని విభజించి తరిగొప్పుల మండలం ఏర్పాటు ఏర్పాటు చేశారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చారు. రూ.325 కోట్లతో మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు కొత్తగా కాలువ నిర్మాణం పూర్తిచేశారు. మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని తండాలకు రూ.20 కోట్లతో బీటీరోడ్లు, చేర్యాల-నంగునూరు మార్గంలో రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం పనులు, కొమురవెల్లి మల్లన్న ఆలయం నుంచి రాజీవ్ రహదారి వరకు డబుల్ రోడ్డు విస్తరణ, కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. జనగామ మండలం చంపక్‌హిల్స్‌లో ఎంసీహెచ్ దవాఖాన, ధర్మకంచలో అంబేద్కర్ స్టేడియం, ఇండోర్ స్టేడియం నిర్మించారు. జనగామ, చేర్యాల వ్యవసాయ మార్కెట్‌లో వర్క్‌షెడ్లు నిర్మించారు. జనగామ మున్సిపాలిటీల రూ.50 కోట్లతో పట్టణ సుందరీకరణ, అభివృద్ధి పనులు, బతుకమ్మకుంట అభివృద్ధి, సుందరీకరణ చేపట్టారు. జనగామ జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ, మున్సిపల్ కొత్త భవనం నిర్మాణం, సమీకృత కలెక్టరేట్ భవనం నిర్మాణం, చౌరస్తా-నెహ్రూపార్కు ప్రధాన రోడ్డు విస్తరణ, జనగామకు జిల్లా కోర్టు ఏర్పాటు, ఏరియా దవాఖాన జిల్లా ప్రధాన వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేశారు.

**ఆరు దశాబ్దాల్లో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నరేండ్లలోనే..**

అరవై ఏండ్లలో జరగని అభివృద్ధిని జనగామ జిల్లాలో తొమ్మిదిన్నరేండ్లలోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారు. రూ.7,500 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు జనగామ నియోజకవర్గానికి అందుతున్నాయి. జనగామ నియోజకవర్గంలో 59,678 ఎకరాల భూమి ఉంటే 2014కు ముందు 15 వేల ఎకరాలకు మించి వరి సాగైన దాఖలాలు లేవు. నేడు వందశాతం భూమి సాగులోకి వచ్చింది. దేవాదుల ఎత్తిపోతలతో ఒకనాడు తిండిగింజలకు దిక్కులేని ప్రాంతం నేడు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక వరి పండించే ప్రాంతంగా ఖ్యాతి పొందింది. 'ఫాస్ట్ మూవింగ్ సిటీగా' జనగామ మున్సిపాలిటీ దేశంలోనే 3వ స్థానంలో నిలిచి కేంద్ర అవార్డును అందుకున్నది.

## నేడు జనగామ, భువనగిరికి సీఎం కేసీఆర్

**రెండు ప్రాంతాల్లో ప్రజా ఆశీర్వాద సభలు • భారీ జన సమీకరణకు బీఆర్ఎస్ ఏర్పాట్లు**

హైదరాబాద్/జనగామ/యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమరానికి హుస్నాబాద్‌లో శంఖారావం పూరించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. ప్రచారపర్వాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. సోమవారం జనగామ, భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని, భువనగిరిలో పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన అభ్యర్థించనున్నారు. జనగామలోని మెడికల్ కాలేజీ మైదానంలో ప్రజా ఆశీర్వాద సభకు భారీ ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలు, రెండు పట్టణాల నుంచి లక్షకుపైగా జనం తరలివచ్చేలా ఏర్పాట్లు పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నేరుగా జనగామలోని సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొంటారు. అనంతరం సభలో ప్రసంగిస్తారు. జనగామ సభ ముగిసిన వెంటనే సీఎం కేసీఆర్ భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు హాజరు కానున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. వేదికను, సభా ప్రాంగణంతోపాటు హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా రెయిన్ ప్రూఫ్ స్టేజీ వేశారు. బహిరంగ సభ నేపథ్యంలో భువనగిరి పట్టణం గులాబీమయంగా మారింది. జనం ఇబ్బందులు పడకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు 60 వేల మందికి పైగా జనం రానున్నట్టు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి. రెండో చోట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

హైదరాబాద్‌ను ఆనుకొని ఉన్న భువనగిరిని ఉమ్మడి పాలకులు పట్టించుకోలేదు. ఫలితంగా తెలంగాణ ఇలవేల్పు యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. పోచంపల్లి చేనేత కార్మికుల కళానైపుణ్యానికి ప్రోత్సాహం అందలేదు. పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్యంతోపాటు ఇతర రంగాల్లోనూ ఎలాంటి పురోగతి కానరాలేదు. ఉమ్మడి పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తున్నది. సీఎం కేసీఆర్ సంకల్పంతో పునరుద్ధరించిన యాదగిరిగుట్ట ఇల వైకుంఠంగా విరాజిల్లుతున్నది. చౌటుప్పల్ దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్కు దేశానికే తలమానికంగా మారింది. కాళేశ్వర జలాలతో జిల్లా సస్యశ్యామలంగా మారింది.

# పరిశ్రమల అడ్డా.. భువనగిరి గడ్డ

- దేశానికే తలమానికం మన దండు మల్కాపురం గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు
- అక్కడ ప్రస్తుతం 50కిపైగా పరిశ్రమలు
- నిర్మాణ దశలో మరో 150 ఇండస్ట్రీలు
- పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కుతో వేల మంది చేనేత కార్మికులకు ఉపాధి
- నర్సన్న సాక్షిగా యాదాద్రి ప్రగతి పరుగులు
- పరవళ్లు తొక్కుతున్న కాళేశ్వరం జలాలు
- నృసింహసాగర్‌తో లక్షల ఎకరాలకు నీరు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి పరుగులు పెడుతున్నది. సీఎం కేసీఆర్ యావత్ దేశం అబ్బురపడేలా యాదగిరిగుట్టను మలిచారు. ఇందుకు దాదాపు రూ.1200 కోట్లకుపైగా ఖర్చు చేశారు. నిత్యం సగటున 20 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. పారిశ్రామికంగా కూడా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చర్యలు చేపట్టింది. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో ఏర్పాటుచేసిన గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో ప్రస్తుతం 50కిపైగా పరిశ్రమలు పనిచేస్తున్నాయి. మరో 150 పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 400 పరిశ్రమలు రానున్నాయి. దాంతో 40 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనున్నది. వ్యవసాయ రంగంలోనూ కేసీఆర్ సర్కారు విప్లవాత్మక చర్యలు చేపట్టింది. కాళేశ్వరం-16వ ప్యాకేజీలో భాగంగా భువనగిరి మండలంలో రూ.1,059 కోట్లతో 11.39 టీఎంసీల సామర్థ్యంతో బస్వాపూర్ (నృసింహ సాగర్) ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 95% పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్ట్ పూర్తయితే 1.88 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. ఇప్పటికే బస్వాపూర్ రిజర్వాయర్‌తో యాదగిరిగుట్ట నర్సన్న పాదాలను గోదావరి జలాలు ముద్దాడాయి. 2020లోనే కొండపోచమ్మసాగర్ నుంచి తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలారామారం మండలాలకు నీరు అందింది.

**పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు..**

భూదాన్‌పోచంపల్లి మండలం కునుముక్కుల గ్రామంలో 22 ఎకరాల్లో పెట్టిన హ్యాండ్లూమ్ పార్కును ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. ఈ పార్కు అందుబాటులోకి వస్తే రానున్న రోజుల్లో వేలాది మంది చేనేత కార్మికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడనున్నది. ఇందులో వచ్చిన ఆదాయాన్ని పోచంపల్లి కార్మికుల కోసమే ఖర్చు చేస్తామని ఇటీవల మంత్రి కేటీఆర్ స్వయంగా ప్రకటించారు. తుర్కపల్లిలో మరో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఇప్పటికే పార్కు ఏర్పాటుకు 93.21 ఎకరాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. యాదగిరిగుట్టలో మెడికల్ కాలేజీ నిర్మాణం కానున్నది. కల్లు గీత కార్మికుల జీవన స్థితిగతులు మార్చే లక్ష్యంగా భువనగిరి మండలంలోని నందనంలో నీరా ప్లాంట్ సిద్ధమవుతున్నది.



చౌటుప్పల్ శివారు దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన పరిశ్రమ



ఆదివారం హైదరాబాద్‌లో నల్లగొండ ఎంపీపీ మనిమద్దె సుమన్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## బీఆర్ఎస్‌లోకి నల్లగొండ ఎంపీపీ

- మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిన సుమన్

నల్లగొండ, అక్టోబర్ 15 : నల్లగొండ నియోజకవర్గంలో ఏకైక కాంగ్రెస్ ఎంపీపీ మనిమద్దె సుమన్ బీఆర్ఎస్‌లో చేరడంతో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గట్టి షాక్ తగిలినట్లయింది. స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి కేటీఆర్ సుమన్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నల్లగొండ నియోజకవర్గంలో నల్లగొండ, తిప్పర్తి, కనగల్, మాడ్గులపల్లి మండలాలు ఉండగా, ఒక్క నల్లగొండ మినహాయిస్తే తిప్పర్తి, కనగల్, మాడ్గులపల్లి ఎంపీపీలు బీఆర్ఎస్‌కు చెందినవారే కాగా నల్లగొండ ఎంపీపీ సుమన్ మాత్రమే కాంగ్రెస్‌లో ఉన్నారు. ఆయన సైతం బీఆర్ఎస్‌లో చేరడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఎంపీపీ లేకుండా పోయారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. నల్లగొండ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరగుతున్నదని, అది పూర్తిస్థాయిలో కొనసాగాలంటే మరోసారి కేసీఆరే సీఎం కావాలనే ఆలోచనతో బీఆర్ఎస్‌లో చేరినట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## 'బీమా'పై అర్వింద్ అక్కసు

- ఓటమి భయంతో సీఎం కేసీఆర్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు
- వారు చస్తే రూ.5లక్షలు ఇస్తానంటూ నిజామాబాద్ ఎంపీ దిగజారుడు మాటలు

డిచ్‌పల్లి, అక్టోబర్ 15: సీఎం కేసీఆర్ ఆదివారం విడుదల చేసిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో తెల్ల రేషన్‌కార్డుకలిగి ఉండి..దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 93 లక్షల కుటుంబాలకు రూ. 5లక్షల బీమా అమలు చేస్తామని ప్రకటించారు. కార్డుదారుడు ఏ విధంగా మరణించినా బీమా అందజేస్తామని స్పష్టం చేశారు. దీనికి 'కేసీఆర్ బీమా- ప్రతి ఇంటికి ధీమా' అని పేరు పెట్టారు. అయితే, ఈ బీమాతో తమ ఓటమి తప్పదని భావించిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అసహనంతో ఊగిపోయారు. సీఎం కేసీఆర్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం అర్వింద్ మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, కవిత చస్తే ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున బీమా కింద డబ్బులు తాను ఇస్తానంటూ దిగజారుడు వ్యాఖ్యలు చేశారు.

**బీమాపై భయమెందుకు?**

తెలంగాణలో సీఎం కేసీఆర్ అన్నదాతలు, గీత, చేనేత కార్మికుల కోసం బీమాను అమలుచేస్తున్నారు. ఈ బీమా అనేది ఏ ఒక్కవర్గానికో పరిమితం కాకుండా రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు అమలు చేయాలని కేసీఆర్ బీమా- ప్రతి ఇంటికి ధీమా' పథకాన్ని మ్యానిఫెస్టోలో పెట్టారు. ఇందుకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. పేద ప్రజలందరికీ మంచి పథకం తెస్తామని చెప్తే స్వాగతించాల్సిందిపోయి ఎంపీ అర్వింద్ విషం చిమ్మారు. ఓటమి భయంతోనే నోటికొచ్చినట్టు మాట్లాడి, ప్రజల్లో చులకనైపోయారు. తెలంగాణలో ఏ నిరుపేద కుటుంబమూ పెద్ద దిక్కు కోల్పోతే రోడ్డున పడొద్దనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రకటించిన బీమాను చూసి అర్వింద్, బీజేపీ భయపడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# తలతెగిపడినా తలవంచం

- మోదీతో, బీజేపీతో రాజీపడం
- కాంగ్రెస్‌వి దింపుడుకల్లం ఆశలు
- మరోసారి కేసీఆరే ముఖ్యమంత్రి అని ప్రజలు డిక్లరేషన్ ఎప్పుడో ఇచ్చేశారు
- ప్రవళిక విషయంలో విపక్ష నేతలు వ్యక్తిగత గోప్యత పాటించాల్సింది
- మంత్రి కే తారకరామారావు



*ఒక అమ్మాయిని ఒక అయ్యచేతిలో పెట్టాలంటే ఇటేడు తరాలు అటేడు తరాలు చూస్తారు. అలాంటిది రాష్ట్రాన్ని, రాష్ట్ర భవిష్యత్తును అన్ని కోణాల్లో ఆలోచించి ఓటర్లు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయం. రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో ఎప్పుడు జైలుకు పోతారో తెలియదు? అలాంటి వ్యక్తి చేతుల్లో రాష్ట్రాన్ని పెడ్తారా?*

**- మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఎప్పటికైనా దేశానికి ప్రథమ శత్రువు బీజేపీయేనని మంత్రి కేటీఆర్ తేల్చిచెప్పారు. మోదీ ముందు, బీజేపీ ముందు తలవంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌వి దింపుడుకల్లం ఆశలు మాత్రమేనని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని జోస్యం చెప్పారు. కేటీఆర్ ఆదివారం ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'గెలిచేది మేమే.. మా సీఎం అభ్యర్థి, సీఎం అయ్యేది ముమ్మాటికీ కేసీఆరే' అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌కు ప్రత్యామ్నాయమైన నాయకుడే లేరని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు సీట్లు పంచుకునేలోగా తాము స్వీట్లు పంచుకుంటామని తెలిపారు.

**పథకాలను కాపీ కొట్టింది కాంగ్రెస్సే**

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టిందనడం హాస్యాస్పదమని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకాలకే పేర్లు మార్చి కాంగ్రెస్ డిక్లరేషన్ పేరుతో ప్రకటించిందని పేర్కొన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్‌ను కాదని, 3 గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటేస్తారా? అని ప్రశ్నించారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చని పార్టీ కాంగ్రెస్ అని, మ్యానిఫెస్టోలో లేని ఎన్నో పథకాలు తీసుకొచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. తాము బడ్జెట్ బేరీజు వేసుకుని హామీలు ఇస్తామని చెప్పారు. 2018లో రాహుల్ గాంధీ స్వయంగా రాష్ట్రానికి వచ్చి రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పారని, తాము మాత్రం రూ.లక్ష మాఫీ చేస్తామని చెప్పామని గుర్తు చేశారు. కర్ణాటకను చూస్తే కాంగ్రెస్ పరిస్థితి ఏంటో అర్థమవుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో చుక్క మందుపోయకుండా, డబ్బులు పంచకుండా ఎన్నికల్లో పోటీ చేస్తానని రేవంత్‌రెడ్డి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రం మొత్తం చూస్తుండగా డబ్బులు పంచిన వ్యక్తి, ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ ఇలా మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 2018 ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాయం తీసుకుంటానని చెప్పి మాట తప్పిన సన్నాసి మాటలు ఎలా నమ్ముతామని పేర్కొన్నారు. 1989 నుంచి నేటి వరకు తెలంగాణలో ఎన్నడూ యాభై సీట్లు దాటి గెలవని విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి క్యాడర్‌లేదని 'కాంగ్రెస్ పార్టీ గెలిచేది లేదు.. సచ్చేది లేదు' అని తేల్చిచెప్పారు. నాడు డీఎస్ ఇంటికి తులం బంగారం పంచి.. ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. తనకు సిరిసిల్ల ప్రజలపై పూర్తి విశ్వాసం ఉన్నట్టు తెలిపారు. తన కంటే మెరుగైన అభ్యర్థి కనిపిస్తే.. ఆయననే గెలిపించమని తాను కోరుతానని చెబుతూ తన చిత్తశుద్ధిని ప్రకటించుకున్నారు.

**పేదరికానికి బీజేపీనే కారణం**

దేశంలో గుండు పిన్ను నుంచి గోల్డ్ కొనేవారి వరకూ అంతా ట్యాక్స్‌పేయర్సే అని కేటీఆర్ పేర్కొన్నారు. తాము మాత్రమే ట్యాక్స్ కడుతున్నామని, తమమీదే దేశం ఆధారపడి ఉందని కొందరు అనుకోవడం సరికాదని తెలిపారు. మనం చంద్రయాన్‌ను పంపినా.. ఇక్కడ తిండికోసం ఏడ్చే పేదలున్నారని పేర్కొన్నారు. ఇంత పేదలున్న దేశంలో పన్నెండున్నర లక్షల కోట్లను కార్పొరేట్లకు రుణమాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. దేశంలో పేదరికానికి బీజేపీయే కారణమని ఆరోపించారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుతున్న పార్టీ బీజేపీ అని మండిపడ్డారు. నిజామాబాద్ సభలో మోదీ చేసిన వ్యాఖ్యలను మంత్రి కేటీఆర్ మరోసారి తిప్పికొట్టారు. తమ పార్టీకి 105 మంది ఎమ్మెల్యేలున్నారని, తనను సీఎం చేయాలనుకుంటే ఎమ్మెల్యే మద్దతు అవసరం. కానీ, ఆయనెవరని, ఆయన అనుమతి ఎందుకని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్రంలో ఔట్‌డేటెడ్ పార్టీ అని, ఇప్పుడు 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని తేల్చి చెప్పారు.

**ప్రవళిక విషయంలో తప్పు చేస్తున్నారు**

ప్రవళిక ఆత్మహత్య విషయంలో విపక్ష పార్టీలు, నేతలు అవగాహన లేకుండా ఆందోళనలు చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ చేతుల్లోకి వెళ్లిన పోలీసు వ్యవస్థపై రాజకీయ ఒత్తిడి ఉందని చెప్పడం అబద్ధమని తెలిపారు. పరీక్ష ఎందుకు వాయిదా పడిందో? దాని వెనక ఎవరున్నారో అందరికీ తెలుసని చెప్పారు. బాధిత విద్యార్థిని వాట్సాప్ చాటింగ్, వీడియోలు బయటపెడితే తద్వారా పోయే పరువును విపక్షాలు తీసుకొస్తాయా? అని మండిపడ్డారు. ప్రవళిక అసలు గ్రూప్స్‌కే దరఖాస్తు చేయలేదంటే ఎందుకు నమ్మడం లేదని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీలో జరిగిన లోటుపాట్లు సవరించుకుంటామని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ 24 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తే.. తాము 2,21,000 నియామకాలు చేపట్టినట్టు గుర్తు చేశారు. వెయ్యికి పైగా గురుకులాలు పెట్టి ఆరున్నర లక్షల మంది పిల్లలకు విద్యను అందిస్తున్నామని, వారు ఐఐటీ, ఐఐఎం, నీట్‌లలో ర్యాంకులు సాధిస్తున్నారని చెప్పారు. 8వేలమందిని విదేశాలకు పంపి చదివిస్తున్నామని, వారిలో కొందరు ఉద్యోగాలు సృష్టిస్తున్నారని అన్నారు.

*అధికారంలో ఉన్నోళ్లు నచ్చకపోతేనే ప్రజలు వేరే పార్టీవైపు చూస్తారు. తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. అన్నివర్గాలను సీఎం కేసీఆర్ కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారు. ప్రజలు కూడా ఆయన్ని దీవిస్తున్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన సీఎం కేసీఆర్‌కు ఓటెయ్యాలో? గాలిమాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీలకు ఓటెయ్యాలో? తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. తెలంగాణకు కాబోయే సీఎం కేసీఆర్ అని ప్రజలెప్పుడో డిక్లరేషన్ ఇచ్చేశారు.*

**- మంత్రి కేటీఆర్**

## భక్తజన సంద్రంగా ఇంద్రకీలాద్రి

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో తొలిరోజైన ఆదివారం అమ్మవారు స్వర్ణకవచాలంకృత బాలత్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రిపై రద్దీ నెలకొన్నది.

## మంత్రి కేటీఆర్‌కు వడ్డెర సంఘం మద్దతు

- నామినేషన్ ఖర్చులకు నగదు అందజేత

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 15: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల వడ్డెర సంఘం నాయకులు మంత్రి కేటీఆర్‌కు మద్దతు ప్రకటించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇంపీరియల్ గార్డెన్‌లో సమావేశమైన వీరు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. 'మా ఓటు రామన్నకే' అంటూ ప్రమాణం చేయడంతోపాటు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం మంత్రి కేటీఆర్ నామినేషన్ ఖర్చు కోసం రూ.10,116లను బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లి రామ్మోహన్‌కు అందజేశారు.

**నిపుణ** | విద్య, ఉద్యోగ సమాచారం

### ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

**ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 495
- పోస్టులు: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ట్రెయినీ
- విభాగాలు: ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, మైనింగ్
- ఎంపిక: గేట్-2023 స్కోర్ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 20
- వెబ్‌సైట్: www.ntpc.co.in

### ఐబీలో..

**ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 677
- పోస్టులు: సెక్యూరిటీ అసిస్టెంట్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్, ఎంటీఎస్/జనరల్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 13
- వెబ్‌సైట్: https://www.mha.gov.in

### టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

**భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 27
- పోస్టులు: టీచింగ్ (ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్), నాన్ టీచింగ్ (స్క్రిప్ట్ రైటర్, ప్లంబర్, ఇంటర్నల్ ఆడిటర్ తదితరాలు)
- దరఖాస్తు, ఎంపిక, చివరితేదీ తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- వెబ్‌సైట్: www.nitttrbpl.ac.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

**పోటీ పరీక్షల ప్రత్యేకం**

- ఎకనామిక్స్, ఫిజిక్స్, ఎస్‌జీటీ-మ్యాథ్స్ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.